
సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 2 । జూలై । 2024



అందం..ఆహ్లాదం!

హార్సిలీహిల్స్‌పైన, చుట్టూ కొండలు పచ్చగా కనువిందు చేస్తున్నాయి. ఘాట్‌రోడ్డుకు ఇరు వైపులా పూలతో వృక్షాలు రా.. రమ్మని అతిథులకు స్వాగతం పలుకుతున్నాయి. - 8లో



కృష్ణజింకపై కుక్కల దాడి

కృష్ణ జింకపై ఊర కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ సంఘటన తంబళ్లపల్లె మండలంలో సోమవారం వెలుగు చూసింది. వైద్యులు జింకకు చికిత్స అందించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.390	రూ.460
రెండోరకం	రూ.300	రూ.380



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1424 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	710
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 722.84 కిలోలు

న్యూస్‌రీల్

వారణాసిలో పూజకు రాజంపేట నుంచి శివలింగాలు

రాజంపేట టౌన్ : ఈ ఏడాది కార్తీక మాసంలో వారణాసిలో సామవేదం షణ్ముఖశాస్త్రి ఆధ్వర్యంలో జరిగే కోటి శివలింగాల పూజకు రాజంపేట నుంచి 10 వేల మట్టి శివలింగాలను పట్టణానికి చెందిన మహిళలు పంపనున్నారు. అందులో భాగంగా రాజంపేట పట్టణానికి చెందిన దాదాపు ఐదువందల మంది మహిళలు పదివేల మట్టి శివలింగాలను తయారు చేశారు. వీటికి శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, అమ్మవారిశాలల్లో సోమవారం విశేషంగా పూజలు నిర్వహించారు. తిరుపతి నుంచి ప్రత్యేకమైన మట్టిని తీసుకొచ్చి శివలింగాలను తయారు చేసినట్లు మహిళలు తెలిపారు. వీటిని ప్రత్యేక వాహనంలో వారణాసికి చేర్చనున్నట్లు వారు తెలిపారు.

అభ్యర్థుల తుది వ్యయ రిజిస్టర్లను సమర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు

రాయచోటి : 2024 సార్వత్రిక ఎన్నికలలో అన్నమయ్య జిల్లా నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ తుది వ్యయ రిజిస్టర్లను సమర్పించాలని జిల్లా ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులు రవీందర్‌కుమార్(ఐఆర్ఎస్), ఎస్‌జి మూన్(ఐఆర్ఎస్), వైభవ్‌శుక్లా(ఐఏఎస్)లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థులకు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, భారత ఎన్నికల సంఘం జిల్లాకు కేటాయించిన ఎన్నికల పరిశీలకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లా వ్యయ పరిశీలన కమిటీ ఇచ్చిన ఆదేశాలపై ఏ అభ్యర్థి కైనా ఆదేశాలకు భిన్నమైన అభిప్రాయం ఉంటే సంబంధిత పత్రాలను సమర్పించి వ్యయ రిజిస్టర్లను పూర్తి స్థాయిలో జిల్లా వ్యయ పరిశీలన కమిటీకి సమర్పించాలన్నారు. నివేదికలను జిల్లా ఎన్నికల అధికారి భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయనున్నారని గుర్తు చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థుల తుది వ్యయ రిజిస్టర్లను పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని, ఎవరైనా అభ్యర్థి తమ రిజిస్టర్లను సమర్పించకపోతే ఈ రీకన్సిలేషన్ సమావేశాన్ని ఉపయోగించుకొని రిజిస్టర్లను పూర్తి చేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



రాయచోటి రూరల్ : అన్నమయ్య జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పర్సన్-ఇన్‌చార్జిగా జిల్లా మార్కెటింగ్ అధికారి టి.త్యాగరాజు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ పాలకమండలి సభ్యులను ప్రభుత్వం రద్దు చేస్తూ జూన్ 28న ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, పీలేరు, అంగళ్లు వ్యవసాయ మార్కెట్ కమిటీల కాలపరిమితి ముగిసింది. అలాగే మదనపల్లె, రాజంపేట, వాల్మీకిపురం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామా చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, పీలేరు, అంగళ్లు, మదనపల్లి, రాజంపేట, వాల్మీకిపురం 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పర్సన్-ఇన్‌చార్జ్‌గా జిల్లా మార్కెట్ అధికారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం టి.త్యాగరాజు పర్సన్- ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.

దివ్యాంగులకు చేయూత అందిద్దాం

రాయచోటి జగదాంబసెంటర్ : దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్ ఆధ్వర్యంలో ఆరు నుంచి 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు(పరికరాలు) పంపిణీ కోసం నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి, సుండుపల్లె, వీరబల్లి, రామాపురం, సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి మండలాల్లోని దాదాపుగా వంద మందికి పైగా దివ్యాంగ పిల్లలకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వీరికి అవసరమయ్యే వీల్‌చైర్, సీపీచైర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు ఇతర పరికరాలను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి మండలంలోనూ దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్యను అందించేందుకు భవిత కేంద్రాలు ఉన్నాయని, వీటిల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్టు ఉన్నారన్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ఏఆర్ నరసింహారావు, రాజఅహ్మద్, త్రిలోక్య, రామరాజు, ఫిజియోథెరపిస్ట్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాలకు వేళాయె

- కోర్సుల్లో ప్రవేశాలకు సమయం ఆసన్నం
- ప్రారంభమైన ఈఏపీసెట్‌లో ప్రవేశాల ప్రక్రియ
- 1 నుంచి ప్రారంభం.. 22వ తేదీతో ముగింపు



రాయచోటిలోని బిట్స్ ఇంజినీరింగ్ కళాశాల

రాయచోటి : విద్యార్థుల ఉజ్వల భవితకు ఇంజినీరింగ్ కోర్సులు వారధిగా నిలుస్తున్నాయి. దశాబ్దాలుగా సాంకేతిక రంగంలో నెలకొన్న విప్లవాత్మక మార్పులతో ఇంజినీరింగ్ విద్యపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆసక్తిని చూపుతున్నారు. ఇంజినీరింగ్ కోర్సు పూర్తికాగానే కార్పొరేట్ సంస్థల్లో సాఫ్ట్‌వేర్ కొలువులు, లక్షల్లో ప్యాకేజీలతోపాటు విస్తృత అవకాశాలు ఉండటంతో ఇంజినీరింగ్‌కు ఏటా క్రేజ్ పెరుగుతూనే ఉంది. తాజాగా ఈఏపీ సెట్ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కళాశాలలతోపాటు కోర్సుల ఎంపిక కీలకంగా మారింది. ఏ కోర్సు చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఏ కళాశాలలో అయితే భవిత బాగుంటుందనే విషయ సేకరించే పనిలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు

ఇంజనీరింగ్‌లో సీఎస్‌సీదే పైచేయి...

ఇంజనీరింగ్ విద్యలో ముఖ్యంగా సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో సీఎస్‌ఈ బ్రాంచ్‌కు యమా క్రేజ్ ఉంటుంది. ఈ గ్రూపునకే విద్యార్థులు తొలి ప్రాధాన్యమిస్తారు. ఐటీ కొలువులకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు ఉండటమే ఇందుకు కారణం. రెండవ ప్రాధాన్యత ఈసీఈ బ్రాంచ్‌కు ఉంటుంది. ఈ కోర్సుతో ఎలక్ట్రికల్ పరికరాలు, అనలాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్, శాటిలైట్ కమ్యూనికేషన్, మైక్రోవేవ్ ఇంజనీరింగ్, మైక్రోప్రాసెస్‌తోపాటు పలు అంశాలపై బోధనలు ఉంటాయి, కోర్ సెక్టార్‌తోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలోను కొలువులకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఈ కోర్సుకు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. ఇక మూడోది సివిల్ బ్రాంచి. ఈ సివిల్ కోర్సులో నిర్మాణ రంగంలో ఉద్యోగాలతోపాటు సొంతంగా కన్సల్టెన్సీలు ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందవచ్చు. అలాగే మెకానికల్ ఇంజనీరింగ్‌కు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. అలాగే ఆటోమొబైల్స్,ఎలక్ట్రికల్ మెటార్లు రంగంలో రాణించడంతో ఈ గ్రూపుకు కూడా మంచి డిమాండే ఉటుంది.

కొత్త బ్రాంచులు అందుబాటులోకి..

జిల్లాలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు కొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. సీఎస్‌ఈలో ఏఐ, మెషన్ లర్నింగ్, సైన్సు రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, మెరైన్ , మైనింగ్ వంటి కొత్త బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి. మంచి ర్యాంకులు వచ్చిన చాలా మంది విద్యార్థులు ఫస్ట్ ఆప్షన్ కింద సీఎస్‌సీ గ్రూపుల్లో చేరేందుకు అసక్తి కనబరచగా రెండవ ఆప్షన్ కింద ఈసీఈలో చేరేందుకు ఆసక్తి చూపుతారు.

జిల్లాలో కళాశాలల వివరాలు ఇలా...

ఈఏపీ సెట్ కౌన్సిలింగ్ ప్రారంభమైంది. ఇప్పటికే వారికి వచ్చిన ర్యాంకుల బట్టి ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలి.. ఏ కళాశాల చేరాలో వంటి అంశాలపై విద్యార్థులు అవగాహనకు వచ్చి ఉంటారు. అన్నమయ్య జిల్లాలో రాయచోటిలో 2, రాజంపేటలో 2, మదనపల్లెలో 1, కురబలకోటలో 3 వంతున 8 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా ఇందులో 6895 సీట్లు ఉన్నాయి. అలాగే కలికిరిలోని జేఎన్‌టీయూ పరిధిలో ఒక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఉండగా అందులో 420 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా ఈ ఏడాది ఇంకా కొన్ని సీట్ల సంఖ్యను పెంచినట్లు తెలిసింది.

ఇవి చూసుకోవాలి..

విద్యార్థులు కళాశాలల్లో చేరేముందు నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపులు ఉన్నాయా లేదా అని గమనించాలి. దీంతోపాటు ప్రవేశాలు, ప్లేస్‌మెంట్ ఎలా ఉన్నాయనే విషయాలను ఆరా తీసి పూర్వపు విద్యార్థుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా చేరితే మంచిది. కళాశాల మీద అవగాహన లేకుండా చేరడం వల్ల భవిష్యత్తులో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. బ్రాంచ్ కంటే కూడా కళాశాల ఎంపికే కీలకమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



ఈఏపీ సెట్‌లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నుంచి ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక సమయంలో విద్యార్థి దగ్గరుండి స్వయంగా చూసుకోవాలి. స్నేహితులు మరొకరి సహకారంతో ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తే తప్పులు జరిగే అవకాశం ఉంటుంది.అందువల్ల మీరే స్వయంగా వెళ్లి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాలి. ఇందుకు సంబంధించి విద్యార్థి లేదా వారి తల్లిదండ్రులకు సంబంధించిన సెల్ నంబర్‌ను మాత్రమే ఇవ్వాలి.

– సుధాకర్‌రెడ్డి, శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్, రాయచోటి

- cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈఏపీ సెట్–24 అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి.
- వచ్చిన రిజిస్ట్రేషన్ ఫారంతో హాల్‌టికెట్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించాలి. అందులో సమాచారం క్షుణంగా నింపి సబ్‌మిట్ కొట్టాలి.
- 10వ తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, రేషన్‌కార్డు జిరాక్స్ అప్‌లోడ్ చేయాలి.

అన్‌లైన్ కౌన్సిలింగ్ ఇలా..

- గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ రుణ పత్రం గలవారికి 10 శాతం రిజిస్ట్రేషన్ అమలు చేస్తున్నారు.
- ఈ నెల 1 నుంచి జులై 7 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- ఇందులో వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1200, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ. 600 ఫీజును ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డు లేదా డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకు ద్వారా ఫీజును చెల్లించాలి.
- ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది.
- జులై 8 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 13వ తేదీ వెబ్ ఆప్షన్లు మార్పునకు అవకాశం
- 16న సీట్లు కేటాయింపు, 17వ తేదీ నుంచి 22వ తేదీ మధ్యలో కళాశాలల్లో రిపోర్టింగ్
- జూలై 17వ తేదీ నుంచి ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం

విద్యార్థుల మానసిక స్థితిని తెలుసుకుని బోధనలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

రాజంపేట టౌన్ : తరగతి గదిలో విద్యార్థుల మానసిక స్థితిని తెలుసుకొని ఉపాధ్యాయులు బోధనలు చేయాలని ఆర్జేడీ రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని బోయినపల్లె జెడ్పీ హైస్కూల్‌లో టీచ్ టూల్స్‌పై సోమవారం ప్రారంభమైన శిక్షణా కార్యక్రమంలో ఆర్జేడీ పాల్గొని మాట్లాడారు. తొమ్మిదిరోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకునే అంశాలను ఉపాధ్యాయులు విధిగా తరగతి గదిలో పాటించాలన్నారు. బోధన చేసే సమయంలో పిల్లలు పాఠాన్ని శ్రద్ధగా వింటున్నారా లేదా అన్న విషయాన్ని కూడా ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. తరగతి గదిలోని విద్యార్థులంతా ఏకాగ్రతతో పాఠం వింటే హైగ్రేడ్‌గా, సగం మంది మాత్రమే వింటే మీడియం గ్రేడ్‌గా, ఒకరిద్దరు మాత్రమే పాఠం వింటే లోగ్రేడ్‌గా పరిగణించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై బోధనలు చేయాలని, అదే సమయంలో వారిపై ఆజమాయిషి కూడా ఉండాలన్నారు. తొమ్మిది రోజుల శిక్షణ అనంతరం ఉపాధ్యాయులకు పరీక్ష ఉంటుందని, ఆ పరీక్షలో ఉపాధ్యాయులు విధిగా ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రాజంపేట మండల ఎంఈఓ-1 కొండూరు రఘునాథరాజు, ఎంఈఓ-2 సుబ్బరాయుడు, కోర్స్ ఇన్‌ఛార్జ్, పుల్లంపేట ఎంఈఓ జీ.చక్రధర్‌రాజు, డైరెక్టర్ భారతి, వై.సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

10లోపు డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల రుసుము చెల్లించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు రుసుములు చెల్లించి ఆన్లైన్ దరఖాస్తులు సమర్పించాలని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. 1,2,3,4 సెమిస్టర్లలో ఒక్కో పేపర్, 5 సెమిస్టర్ అన్ని పేపర్లు రాసుకునే అవకాశం కల్పించామన్నారు. పరీక్ష రుసుం పేపర్‌కు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్లైన్ అప్లికేషన్లు వైవీయూ ఎగ్జామ్స్ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

మల్టీనేషనల్ కంపెనీతో అన్నమాచార్య వర్సిటీ ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో అన్నమాచార్య యూనివర్సిటీ, కంపెనీ ప్రతినిధులు

రాజంపేట : హైదరాబాద్‌కు చెందిన కాప్టియస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో అన్నమాచార్య యూనివర్సిటీ అవహగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. సోమవారం ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు ఏయూ రిజిస్ట్రార్ మల్లికార్జున తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం సాంకేతిక బదిలీ పెంచడం, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హెడ్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సునీల్ పట్నాయక్ మాట్లాడుతూ ఇకపై ప్రతి ఏడాది ఈ కంపెనీ అన్నమాచార్య యూనివర్సిటీ నుంచి మెరిట్ స్టూడెంట్స్‌ను రూ.5లక్షల ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కాప్టియస్ కంపెనీ సర్వీస్ హెడ్ హవీష్, శరత్‌కుమార్‌అల్లం, సీనియర్ లీడర్ కన్సల్టెంట్ ఉదయ్, సీనియర్ ప్రాజెక్టు మేనేజరు దినేష్‌బాబు, టీఏలు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఒప్పందపై ఏయూ అధినేత చొప్పాగంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణలు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏయూ టీపీఓ డా.హేమకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, సామాజిక భద్రతకే పింఛన్లు

అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశం



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

లక్కిరెడ్డిపల్లి : పేదవారి సంక్షేమం, సామాజిక భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందిస్తోందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. సోమవారం లక్కిరెడ్డిపల్లి మండలం, అనంతపురం గ్రామం, ఈడిగపల్లిలో లబ్ధిదారుల ఇంటి వద్ద జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్నిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పింఛన్ దారులు ఎందరు ఉన్నారు.. ఇప్పటి వరకు ఎంతమందికి పంపిణీ చేశారు. రశీదు తీసుకుంటున్నారా, పంపిణీలో లబ్ధిదారుల ఐరిష్ లేదా వేలిముద్రలు బాగా పడుతున్నాయా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వి జ్యోతికి వితంతు పింఛన్, సి విశ్వనాథ్‌కు వృద్ధాప్య పింఛన్ కింద రూ.7 వేలు చొప్పున లబ్ధిదారులకు కలెక్టర్ స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఎక్స్ ఎంపిటిసి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన జేసీ

వీరబల్లి : వీరబల్లి మండల కేంద్రంలో సోమ వారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు.ఎంపీడీఓ రామచంద్రారెడి పాల్గొన్నారు.

అతిసార నివారణకు పటిష్ట చర్యలు

రాయచోటి : జిల్లాలో డయేరియా(అతిసార) నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో వైద్యశాఖ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్–2024 కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు జూలై 1వ తేదీ నుంచి 31వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా డయేరియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టాప్ డయేరియా–2024 క్యాంపెయిన్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, డీపీఎంఒ ఎం రియాజ్ బేగ్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజల సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి ఆర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలకు నిర్ణీత కాల పరిమితిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు.

పండుటాకులపై టీడీపీ కక్ష!



ఇక్కడ కన్పిస్తున్న వ్యక్తి పేరు పి.నరసింహులు. టీఓపల్లె గ్రామానికి చెందిన ఇతను 2014 టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి దప్పు కళాకారుడిగా పింఛన్ పొందుతున్నాడు. కొన్నేళ్ల క్రితం కాలుకు ప్రమాదం జరిగింది. పింఛన్ డబ్బులు మీదే ఆధారపడి భార్యను పోషించుకుంటున్నాడు. 'గత నెల వరకూ పింఛన్ వచ్చింది.. ఈ నెలలో ఇవ్వలేదు. ఇదేమనడిగితే ఉన్నతాధికారులు ఆపమన్నారని చెబుతున్నా'రని వాపోయాడు.



ఇక్కడ కన్పిస్తున్న వ్యక్తి పేరు ఆలూరు సీతారాములు. టీఓపల్లె పంచాయతీ రేపల్లెకు చెందిన ఇతనికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇస్తున్న రూ.200ల వికలాంగ పింఛన్ పొందుతున్నాడు. గత నెల వరకూ వికలాంగత్వ పింఛను పొందాడు. ఈ నెలలో పింఛన్ కోసం వెళ్లగా తనకు ఇవ్వడం లేదని వాపోయాడు. తన వికలాంగ సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాతే ఇస్తామని అధికారులు చెబుతున్నారని. కావాలనే గ్రామంలోని టీడీపీ నాయకులు తన పింఛను ఆపిస్తున్నారని, తన చేతిని చూసి కూడా పింఛన్ ఆపటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశాడు.

- ఎమ్మెల్యే పుట్టా ఫిర్యాదుతో 94 మందికి అందని పింఛన్
- పింఛన్ పంపిణీని ఆపించిన ఎంపీడీఓ రహంతుల్లయ్య
- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు



తమ పింఛన్లను ఎందుకు ఆపారని పంచాయతీ కార్యదర్శి వద్ద వాపోతున్న బాధితులు

చాపాడు : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామని టీడీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. 'మీ భద్రతే .. మా బాధ్యత' అంటూ ఊదరగొట్టింది. అవన్నీ మాటలకే అంటూ మరోసారి రుజువు చేసింది. అన్ని అర్హతలున్నా పింఛన్ ఇవ్వకుండా నిరుపేద పండుటాకులకు, దివ్యాంగులకు మోసం చేసింది. మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలోని మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామ పంచాయతీలో 94 మంది పింఛన్ దారులకు డబ్బులు పంపిణీ చేయకుండా వారి కన్నీళ్లకు కారణమైంది. స్వయానా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మూడు పంచాయతీలకు చెందిన 94 మంది పింఛన్‌దారులకు అర్హతలను పునర్విచారణ చేసిన తర్వాతనే డబ్బులు పంపిణీ చేయాలని కలెక్టర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం జరిగిన పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన 94 మందికి పింఛన్ డబ్బులను ఆపాలని ఎంపీడీఓ రహంతుల్లయ్య ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం తెల్లవారుజాము నుంచి పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూసిన సదరు లబ్ధిదారులకు నిరాశ ఎదురైంది. పదేళ్లగా పింఛన్ తీసుకుంటున్నామని ఈ సారి తమకెందుకు పింఛన్ డబ్బులు ఇవ్వలేదని, తామేమి పాపం చేశామని బాధితులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులన్న కారణంగా పింఛన్లు ఆపారని ఆయా గ్రామాల్లో చర్చించుకుంటున్నారు.


ఎంపీడీఓ ఏమన్నారంటే..

మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామాల్లో 94మందికి పింఛన్‌లను ఆపడంపై ఎంపీడీఓ రహంతుల్లయ్యను వివరణ కోరగా.. ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, డీఆర్‌డీఏ పీడీ నుంచి 94 మంది పింఛన్లను వెరిఫికేషన్ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. రెండు మూడు రోజుల్లో వెరిఫికేషన్ చేసిన తర్వాత పింఛన్ల పంపిణీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పింఛన్ డబ్బులు అందని బాధితులు..

మండలంలోని మడూరు పంచాయతీలో వృద్ధాప్య పింఛను పొందుతున్న ఎం.శివారెడ్డి, మబ్బులు, కె.మహమ్మద్ షరీఫ్, మాలబాల సుబ్బారెడ్డి, కట్టుబడి సాసేన్ వలి, మాబు షరీఫ్, సాకం చిన్న సుబ్బారెడ్డి, పర్లపాటి షేక్ రసూల్, బాషా, రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, కల్లెగాల్ల చెన్నమ్మ, చంటి సుబ్బయ్య, ఆవుల గుర్రప్ప, కాలేబు, సానెపల్లె బయపురెడ్డి, లక్షుమ్మ, ఆళ్లగడ్డ దానం, బొగ్గల రాజమ్మ, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, శేషారెడ్డి, పెద్ద లక్ష్మీరెడ్డి, వికలాంగులైన లక్ష్మీప్రియ, సాకం నాగసూయమ్మ, సుభానీ, మహబూబ్ బాషా, రంగాగాళ్ల లలితమ్మ, సుబ్బమ్మ, డప్పు పింఛన్‌దారులు సుబ్బరాయుడు, కల్లగాల్ల సుబ్బరాయుడు, చిన్నటిగాళ్ల సుబ్బరాయుడు, చెప్పులు కుట్టేవారు అంకన్న, పెద్ద ఓబయ్య, బాల ఓబయ్య, అభయహస్తం, వితంతువు మునెమ్మ ఉన్నారు. అలాగే అన్నవరంలో.. వృద్దాప్య పింఛన్ దారులు పల్లవోలు ప్రసాద్‌రెడ్డి, ఆలూరు పీరయ్య, బాషా, వీరనారాయణ, గంగిరెడ్డి, నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, కుల్లాయిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పెద్ద కొండారెడ్డి, కాసా వెంకటసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, సంజీవరెడ్డి, జాకోబ్, చిన్న సుబ్బరాయుడు, వికలాంగులైన ఆదినారాయణరెడ్డి, చింతకుంట హైద్దీన్, ఇందిరమ్మ, కానాల మేరి, గంగయ్య, రామిరెడ్డి, రామ ఓబులరెడ్డి, అశ్వని, రామసుబ్బమ్మ, బంక మమత, చేనేత నారాయణ పింఛన్ ఆపేసిన వారిలో ఉన్నారు. టీఓపల్లెలో.. వృద్దాప్య పింఛన్ పొందుతున్న చెన్నూరు సుబ్బమ్మ, వీరమ్మ, సుబ్బారెడ్డి, ఏ.వెంకటసుబ్బారెడ్డి, కుంచెం సుబ్బ మ్మ, పిచ్చయ్య, మద్దిలేటి, రామయ్య, వెంకటసుబ్బ య్య, శివారెడ్డి, గంగమ్మ, కొండారెడ్డి, వికలాంగులైన సాంబశివారెడ్డి, శ్రీదేవి, తిరుపాలమ్మ, గురుస్వామి, రంగరాజు, సాంబశివారెడ్డి, డప్పు కళాకారులు వెంకటసుబ్బయ్య, చిన్నమ్మ, నరసింహులు, రాముడు, చేనేతలైన సుబ్రమణ్యం, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడులకు పింఛన్ డబ్బులను ఆపారు.

76 ఏళ్లు ఉన్నా వృద్ధాప్య పింఛన్ ఆపడం న్యాయమా



పదేళ్లుగా వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాను. గతంలో టీడీపీ, గత ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా పింఛన్ సజావుగా ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో రావటం మొదటి నెలే నాకు పింఛను ఇవ్వకుండా ఆపటం ఎంత వరకు న్యాయం. 76 ఏళ్లు ఉన్న నా పత్రాలను పరిశీలించిన తర్వాతనే ఇస్తామని చెప్పటం బాధాకరం.

– ముదిరెడ్డి శివారెడ్డి, వృద్ధుడు, మడూరు గ్రామం

క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం

మదనపల్లె : మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన రెండు ద్విచక్రవాహనాలను రాయచోటి పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన ఏ.భానుప్రకాష్(46) ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనం జనవరిలో చోరీకి గురైంది. అదేవిధంగా మే 21న కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ దాదంవారిపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి కుమారుడు యుగంధరరెడ్డి(47) హోండా షైన్ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఆయా చోరీలపై కేసులు నమోదుచేసి, విచారణ చేస్తున్న క్రమంలో రాయచోటి పోలీసులకు నిందితులు దొరకడంతో వారి నుంచి వాహనాలు రికవరీ చేసుకున్నట్లు తెలిపారు.

కృష్ణజింకపై కుక్కల దాడి



జింకకు చికిత్స చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

తంబళ్లపల్లె : కృష్ణ జింకపై ఊర కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో వెలుగు చూసింది. తంబళ్లపల్లె సమీప చేలూరివాండ్లపల్లె పొలాల్లోకి అడవి నుంచి ఓ కృష్ణ జింక వచ్చింది. ఊర కుక్కలు జింకపై దాడి చేశాయి. గుర్తించిన గ్రామస్తులు కుక్కల బారి నుంచి తప్పించి విషయాన్ని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వెటర్నరీ అసిస్టెంట్ కిరణ్‌ను పిలిపించి జింకకు వైద్య చికిత్స చేయించారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

పింఛన్‌దారులకు తప్పని అగచాట్లు



రాఘవరాజుపురంలో మధ్యాహ్నం 1.30 గంటల వరకు పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

రైల్వేకోడూరు అర్బన్ : కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పింఛన్‌దారులకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. సోమవారం పలు గ్రామాలలో ఉద్యోగులు పింఛన్ పంపిణీ చేసేందుకు వచ్చినప్పటికీ వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నెట్‌వర్క్ రాకపోవడంతో పడిగాల్పులు గాయాల్సి వచ్చింది.

అందం..ఆహ్లాదం!

పరవశింపజేసే ప్రకృతి సోయగాలు..రంజింపజేసే ఆహ్లాదకరమైన అందమైన దృశ్యాలు..పులకింపజేసే మేఘాలు..చల్లగా స్పృశించే గాలులు..అబ్బురపరిచే కొండలు, కనువిందుచేసే మహా వృక్షాలు, చిత్ర–విచిత్రాలు అనిపించే పెనవేసుకున్న వృక్షాలు.. ఇలా మైమరపించే సుందర ప్రదేశం బి.కొత్తకోట మండలంలోని ఆంధ్రాఊటీ హార్సిలీహిల్స్ సొంతం. సముద్ర మట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని ఈ కొండపై ప్రస్తుతం వాతావరణం అత్యంత చల్లగా మారిపోయింది. హార్సిలీహిల్స్‌పైన, చుట్టూ కొండలు పచ్చగా కనువిందు చేస్తున్నాయి. ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా విరబూసిన పూలతో వృక్షాలు రా..రమ్మని అతిథులకు స్వాగతం పలుకుతున్నాయి.

– బి.కొత్తకోట



పచ్చనిచెట్ల మధ్యలో గవర్నర్ బంగ్లా, స్విమ్మింగ్‌పూల్



పచ్చనిచెట్లతో నిండిపోయిన టూరిజం రెస్టారెంట్



ఘాట్‌రోడ్డుపై ప్రకృతి అందాలు



పచ్చదనంతో హార్సిలీ కొండలు

ఆటోలు ఢీ

వృద్ధురాలి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కరీమున్నీసా

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి పొద్దుపోయాక జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో పఠాన్ కరీమున్నిసా ఉరఫ్ ఖదీరున్ (82) మృతి చెందగా, పఠాన్ మస్తాన్ బీ, షావలీలకు తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు కడప నగరానికి చెందిన కరీమున్నిసా, పఠాన్ మస్తాన్‌బీ, షావలీ కలిసి ఏపీ 04 టీటీ 8921 ఆటోలో కడప నుంచి చిన్నమండెంకు బయలుదేరారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే రామాపురం వైపు నుంచి వస్తున్న ఏపీ39టీఎఫ్ 5921 ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కరీమున్నిసా సోమవారం మృతి చెందింది. పఠాన్ మస్తాన్‌బీ తలపై తీవ్ర గాయాలు కాగా, షావలీకి కాలు విరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల ఎస్‌ఐ తెలిపారు.

రాజ్యసభలో తొలిసారి గళం విప్పిన 'మేడా'



మాట్లాడుతున్న మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యునిగా మేడా రఘునాథరెడ్డి తొలిసారిగా సోమవారం రాజ్యసభలో తన గళం వినిపించారు. రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం అనంతరం తొలిసభలో రఘునాథరెడ్డికి చర్చించే అవకాశం లభించింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని పోర్టులు, షిపింగ్ యార్డుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. వాటిని ఇప్పుడు మరింతగా అభివృద్ధికి కేంద్రం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో మీడియా ఛానల్స్ ప్రసారాలపై పెట్టిన ఆంక్షలను తొలగించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి అనేక అంశాలపై రాజ్యసభలో ప్రస్తావించారు. ముచ్చటగా మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేక హోదా ఇవ్వాలని, ఫలితంగా రాష్ట్రానికి జరిగే మేలును సభ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రెండు సభలలో టీడీపీ ఎంపీలు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని అంశంపై నోరు విప్పకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీసింది.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



మృతిచెందిన ఉపాధ్యాయుడు బాలక్రిష్ణయ్య

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల కుమ్మరికొట్టాలు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పోరుమామిళ్ల మండలం సూరిసిద్దుపల్లె గ్రామానికి చెందిన గొడ్లవీటి బాలక్రిష్ణయ్య (47) బి.మఠం మండలం పెద్దిరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన బద్వేలు పట్టణంలోని సురేంద్రనగర్‌లో నివసిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రోజూ మాదిరే విధులకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత 7–30 గంటల సమయంలో మినరల్ వాటర్ తీసుకువచ్చేందుకు నడుచుకుంటూ రోడ్డుపై వెళుతుండగా బద్వేలు నుండి చెముడూరుకు వెళుతున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని శేషప్పతోటకు చెందిన గడ్డెం కుసుమకుమారి (25)ని 2020 సంవత్సరంలో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం ఇసుకతక్కేరి గ్రామానికి చెందిన సగరం వెంకటయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లి అయిన కొద్దిరోజుల నుంచే అదనపు కట్నం కోసం భర్త వెంకటయ్య, అత్త మునెమ్మలు తరచూ వేధిస్తుండటంతో భరించలేక కుసుమకుమారి పుట్టిల్లు అయిన మదనపల్లెకు వచ్చింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది.

దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన



కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

సంబేపల్లె : కేంద్ర ప్రభుత్వం 2024. జూలై ఒకటి నుంచి కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత చట్టాలను సవరించి మూడు కొత్త చట్టాలను రూపొందించారన్నారు. కొత్త చట్టాల ద్వారా వెంటనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మహిళలపై హత్యాయత్నాలు, అత్యాచారం వంటి కేసులకు యావజ్జీవ శిక్షణతో పాటు మరణశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. హెల్మెట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. 18 సంవత్సరాలలోపు మైనర్లు వాహనాలు నడిపితే మైనర్‌తోపాటు తల్లిదండ్రులకు శిక్ష తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, కారు ఢీ

– ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం కడప-రేణిగుంట జాతీయ రహదారి పోలుబుచ్చయ్యగారి పల్లి గ్రామం, ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఇరుకు కనుమబోటు వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఆరెంజ్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, కడప నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న చంద్రఓబులేసు (38), హర్షద్ (28), అఫ్తాబ్ (28)లకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం ద్వారా ఒంటిమిట్ట పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను నియంత్రించి బస్సు ప్రయాణికులను మరో ప్రైవేటు బస్సులో ఎక్కించి పంపించారు.

విద్యార్థికి గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు పి.గణేష్(20) అంగళ్లలోని గోల్డెన్‌వ్యాలీ కళాశాలలో డిప్లమా మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం కళాశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా, అంగళ్లు సమీపంలో టూవీలర్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కారు డ్రైవర్‌పై దాడి

మదనపల్లె : కారు డ్రైవర్‌పై అతడి స్నేహితులే దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి పట్టణంలో జరిగింది. అనపగుట్టకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు లక్ష్మీపతి(28) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అమ్మచెరువుమిట్ట వద్ద ఇంటికి వస్తుండగా, వ్యక్తిగత కక్షలతో అతడి స్నేహితులు శంకర, బాలకృష్ణ దాడికి పాల్పడ్డారు. గాయపడిన లక్ష్మీపతి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొంది టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొత్త న్యాయ చట్టాలతో సులువుగా ఫిర్యాదు

డీఎస్పీ వీఎస్‌కే చైతన్య



మాట్లాడుతున్న డీఎస్పీ వీఎస్‌కే చైతన్య

రాజంపేట టౌన్ : కొత్తగా అమలులోకి వచ్చిన న్యాయ చట్టాలతో ఎవరికైనా అన్యాయం జరిగినా, ఇతరుల నుంచి ఇబ్బందులు ఉన్నా సులువుగా పోలీసులకు ఫిర్యాదు చేసుకునే సౌకర్యం ఉందని డీఎస్పీ వీఎస్‌కే చైతన్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కొత్త న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎవరికైనా అన్యాయం జరిగితే బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం బాధితులు పోలీస్ స్టేషన్ పరిధితో పనిలేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎవరైనా ఏదైనా కేసులో అరెస్ట్ అయితే అక్కడి పోలీస్ స్టేషన్‌లోను జిల్లా ప్రధాన కేంద్రంలోను బహిరంగంగా ప్రదర్శిస్తారని తెలిపారు. సమన్లను ఇకపై నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన అవసరం ఉండదని, ఆన్‌లైన్‌లో పంపించవచ్చన్నారు. అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ మద్దయ్యఆచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగడి వీధి గ్రామానికి చెందిన దూదేకుల మహబూబ్ చాంద్ (17) అనే విద్యార్థిని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సీకేదిన్నె సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బాలిక కడప నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు ఆమెను మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది.

ప్రజల హక్కులను హరించే నేర చట్టాలు



అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నేర చట్టాలు ప్రజల హక్కులను హరించే విధంగా ఉన్నాయని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్తనేర చట్టాలను జూలై 1వతేదీ నుంచి అమలు చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ ఫ్లెక్సీవద్ద సోమవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఏఎల్ ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, రాయచోటి బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రెడ్డెయ్య మాట్లాడుతూ కేంద ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలు పాత చట్టాల కంటే మెరుగ్గా ఉండాలే కాని ప్రజల జీవించే హక్కును కాలరాసేలా ఉండకూడదన్నారు. ఈ చట్టాల అమలును తక్షణమే ఆపివేయాలన్నారు. న్యాయ నిపుణులతో కాని, పార్లమెంటులో కాని సరైన చర్చ జరపకుండానే చట్టాలను తయారు చేశారని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, సీనియర్ న్యాయవాదులు రాజకుమార్‌రాజు, ఆనందకుమార్, ధనుంజయకుమార్, కృష్ణయ్య, హుమయూన్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ప్రజాసంఘాల నేతలు రామాంజనేయులు, అక్బర్‌అలీ, పామయ్య తదితరులు న్యాయవాదుల నిరసనకు మద్దతు తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 20లక్షలు చెక్కు అందజేత



కానిస్టేబుల్ సత్యకుమార్ సతీమణి రాజేశ్వరికి చెక్కును అందజేస్తున్న కమాండెంట్ రవిశంకర్

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యకుమార్ గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి సోమవారం రూ. 20 లక్షల నగదు చెక్కును అందజేశామని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటు పి. రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్ కానిస్టేబుల్ సత్యకుమార్ గత ఏడాది డిసెంబర్ 5వ తేదీ తెల్లవారుజామున చెన్నూరు నుంచి బైక్‌పై బెటాలియన్‌లో విధులు నిర్వహించేందుకు వస్తుండగా భాకరాపేట సమీపంలోని మలినేనిపట్నం వద్ద చెట్టు విరిగి బైక్‌పై పడిందన్నారు. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలై మృతి చెందాడన్నారు. అతనికి రావాల్సిన వ్యక్తిగత ప్రమాద బీమా రూ. 20 లక్షల నగదు చెక్కును ఆయన సతీమణి రాజేశ్వరికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి. నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ పి.ఎస్.డి. ప్రసాద్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మురళినాయక్, రాజంపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎన్. విజయ్‌వర్ధన్, భాకరాపేట ఎస్‌బీఐ మేనేజర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీసీలు ఇవ్వలేదని పోలీసులకు ఫిర్యాదు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట టీసీలు ఇవ్వాలని కోరుతూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మదనపల్లె : ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని పైచదువులకు వెళ్లేందుకు టీసీ, సర్టిఫికెట్లు కోరితే యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బెంగళూరురోడ్డు బీటీ కళాశాల ఎదురుగా ఉన్న భారతి జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసిన తమకు సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందిగా కోరితే అదనపు ఫీజు చెల్లించాల్సిందిగా యాజమాన్యం కోరిందన్నారు. కాలేజీలో చేర్పించే సమయంలో తక్కువ ఫీజులు చెప్పి కళాశాలలో చేరి విద్య పూర్తయిన తర్వాత టీసీ ఇచ్చే సమయంలో ఎక్కువ ఫీజులు కట్టమని వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేస్తే.. యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారని తెలిపారు.